అభివృద్ధి పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ చేతనాహరీష్

హబ్సిగూడ: హబ్సిగూడ డివిజన్ వెంకటరెడ్డినగర్ వీధి నెంబర్–9లో జరుగుతున్న సీసీరోడ్డు పనులను మంగళవారం కార్పొరేటర్ కక్కిరేని చేతనాహరీష్ అధికారులతో కలిసి పరిశీలించారు. సీసీరోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆమె సూచించారు. ఏఈ సాయికిరణ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి..

మల్లాపూర్: రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యాత ప్రమాణాలను పాటించాలని నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ అన్నారు. మంగళవారం నాచారం వార్డు కార్యాలయం నుంచి ఎర్రకుంట ఎస్సీ, ఎస్టీ కమ్యూనిటీహాల్ వరకు రూ.54 లక్షలతో సీసీరోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. ఈ పనులను కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ పరిశీలించారు. ఈ సందర్భంగా


సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్

కార్పొరేటర్ మాట్లాడుతూ.. దశలవారీగా డివిజన్‌లో అభివృద్ధి పనులను పూర్తి చేయిస్తున్నామన్నారు. డివిజన్ సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు. డీఈ రూప, వర్క్‌ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, బీఆర్ఎస్ నేతలు చంద్రశేఖర్, టేకులపల్లి రాంచందర్, దాసరి కర్ణ, మంగోల్ శివ, విఠల్‌యాదవ్, కట్ట బుచ్చన్నగౌడ్, మల్లేష్, శంకర్, దానం వాసుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ అందజేత


చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి

మౌలాలి: వినాయక్‌నగర్ డివిజన్‌కు చెందిన పలువురు అనారోగ్యం కారణంగా సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం నవ్యకు రూ.8,500, జ్ఞానేశ్వర్‌గౌడ్‌కు రూ.13,500, పాండుకు రూ.60 వేల చెక్కులు మంజూరు కాగా.. మంగళవారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. బద్దం పరశురాంరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు తులసి, సురేష్, డివిజన్ కార్యదర్శి బాలకృష్ణగుప్తా, ఫరీద్, గుంటి రామచందర్, సర్వేస్‌యాదవ్, సాయిముదిరాజ్, రమేష్, ఉస్మాన్, బీఆర్ఎస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.


ఎల్‌వోసీ పత్రాన్ని అందజేస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

ఎల్‌వోసీ అందజేత..

మల్లాపూర్: నాచారం డివిజన్‌కు చెందిన రవికుమార్ కుమారుడు ఎం.శ్రీదత్త గత నెల 15న నాచారంలో రోడ్డు ప్రమాదంలో గాయపడి నిమ్స్ ఆస్పత్రిలో చిక్సిత పొందుతున్నాడు. కోమాలో ఉన్నాడన్న విషయం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి దృష్టికి నాచారం డివిజన్‌కు చెందిన బీజేపీ నేత రవికాంత్ తీసుకువెళ్లాడు. వెంటనే వైద్యఖర్చుల కోసం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.2.50,000 లక్షల ఎల్‌వోసీ పత్రాన్ని బుధవారం బాధిత కుటుంబసభ్యులకు కేంద్రమంత్రి అందజేశారు.

డీఏ, పీఆర్‌సీ సహా పెండింగ్ బిల్లులు తక్షణమే చెల్లించాలి



సాక్షి,సిటీబ్యూరో: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(టీపీయూఎస్) రాష్ట్ర శాఖ పిలుపు మేరకు మంగళవారం పెండింగ్ డీఏలు, పీఆర్‌సీతో సహా పెండింగ్ బిల్లులు తక్షణమే చెల్లించాలని టీచర్లు ధర్మాగ్రహ దీక్ష నిర్వహించారు. దశలవారీగా టీచర్లు ఆందోళనా కార్యక్రమాలు నిర్వహిస్తోందని టీపీయూఎస్ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా శాఖ పేర్కొంది. కలెక్టరేట్ వద్ద ఆందోళనా కార్యక్రమాన్ని చేపట్టిన టీచర్లు అనంతరం జిల్లా కలెక్టర్ గౌతమ్‌కు సమస్యలతో కూడిన వినతిత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టీపీయూఎస్ రాష్ట్ర కార్యదర్శి గడప నవీన్, జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, జిల్లా నేతలు రమాదేవి, సురేందర్, గోపాల్, రమేష్ రాథోడ్, వెంకటేష్, సంగమేష్, శ్రీనివాస్, వెంకటరమణ పాల్గొన్నారు.

కార్పొరేటర్ పర్యటన

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్ బీరప్పగడ్డ బస్తీలోని పలు కాలనీల్లో కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్ పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. పలు ప్రాంతాల్లో ఇంకా తుప్పు పట్టిన ఐరన్ పోల్స్ ఉన్నాయని వాటిని తొలగించాలని, విద్యుత్ స్తంభాల మధ్య దూరం బాగా ఉండటంతో వైర్లు ప్రమాదకరంగా కిందకు వేలాడుతున్నాయన్నారు. సానుకూలంగా స్పందించిన ఆమె అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. బన్నాల ప్రవీణ్‌ముదిరాజ్, జీహెచ్ఎంసీ డీఈ వినీల్‌కుమార్, ఏఈ వినీత్‌రావు, సూపర్‌వైజర్ జగన్ వివిధ శాఖల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ బన్నాల గీత

సమగ్ర కుటుంబ సర్వేకు సిద్ధం

- ఉప్పల్ సర్కిల్‌లో 637 మంది ఎన్యూమరేటర్లు,
- 67 మంది సూపర్ వైజర్ల నియామకం
- సర్వే చేయనున్న మొత్తం కుటుంబాలు 95,000

రామంతాపూర్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేకు ఉప్పల్ సర్కిల్‌లోని అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. నేటి నుంచి సమగ్ర కుటుంబ సర్వే ప్రారంభమై ఈ నెల 21న ముగుస్తుందని జీహెచ్ఎంసీ ఉప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు ప్రకటించారు. మొత్తం 4వ డివిజన్‌లో 637 మంది ఎన్యూమరేటర్లు, 67 మంది సూపర్ వైజర్‌లను నియమించినట్లు ఆయన పేర్కొన్నారు. ఎన్యూమరేటర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ఎంటమాలజీ పారిశుద్ధ్య, మహిళా పొదుపు సంఘాల సభ్యులను నియమించామని, సూపర్ వైజర్లుగా ప్రభుత్వ టీచర్లు జీహెచ్ఎంసీ అధికారులను నియమించినట్లు పేర్కొన్నారు. సర్వేలో పాల్గొని ఎన్యూమరేటర్లు సర్కిల్‌లోని రామంతాపూర్ ఉప్పల్, హబ్సిగూడ, చిలుకానగర్ డివిజన్‌లోని దాదాపు 95 వేల ఇళ్లను సందర్శించి ప్రతి కుటుంబానికి సంబంధించిన పూర్తి వివరాలు సేకరిస్తారని తెలిపారు. నిర్దేశిత సామాజిక ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కులం తదితర 56 అంశాలతో కూడిన వివరాలు పూర్తి చేయాల్సి ఉంటుందని, ఈ అంశాల ఆధారంగానే భవిష్యత్తులో సంక్షేమ కార్యక్రమాలలో లబ్ధి చేకూర్చడానికి సహకరిస్తాయని సమాచారం. సర్వే కోసం ఇంటికి వచ్చే ఎన్యూమరేటర్లకు ఇంటి యజమాని కేవలం ఆధార్ నెంబర్ ఇవ్వాలని ఇంటికి సంబంధించిన ఏ పత్రాలు ఇవ్వకూడదని అధికారులు చెబుతున్నారు.

ప్రభుత్వానికి ప్రతిష్టాత్మకం..

బోడుప్పల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న సమగ్ర సర్వేకు నగర ప్రజలందరూ సహకరించాలని బోడుప్పల్ కమిషనర్ రామలింగం కోరారు. బోడుప్పల్ ఆర్ కన్వెన్షన్‌లో మంగళవారం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సర్వేపై సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లకు శిక్షణ ఇచ్చామని బుధవారం నుంచి ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహిస్తారన్నారు. తమ సిబ్బంది అడిగే ప్రశ్నలకు నగర పౌరులు సహకరించాలన్నారు. మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లు

కుటుంబానికి 75 ప్రశ్నలు..

ఉప్పల్ : నేటి నుంచి ప్రారంభమయ్యే సమగ్ర కుటుంబ సర్వేకు జీహెచ్ఎంసీ అధికారులు తగిన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఉప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు తెలిపారు. ఒక్కో కుటుంబాన్ని దాదాపుగా 75 ప్రశ్నలు అడిగి వారి వివరాలను సేకరిస్తారు. ప్రతి కుటుంబం సామాజిక, ఆర్థిక, విద్య, కులం, ఆర్థిక పరిస్థితులు, వయస్సు, ఫోన్ నంబర్లు, స్థిర, చరాస్తుల వివరాలను సేకరిస్తారని తెలిపారు. ఎన్యూమరేటర్స్‌కు ఎలాంటి సమస్యలు ఎదురైన స్థానికంగా ఉండే బిల్‌కలెక్టర్లు, టాక్స్ ఇన్‌స్పెక్టర్లు అందుబాటులో ఉంటారని తెలిపారు. వచ్చిన అధికారులకు తమ సమాచారాన్ని పూర్తిగా ఇవ్వాలని ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు స్పష్టం చేశారు.

ప్రజలు సహకరించాలి : డీసీ జగన్

కాప్రా: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కులగణనకు ప్రజలు సహకరించాలని కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జగన్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కులగణన సర్వే పకడ్బందీగా నిర్వహిస్తున్నామన్నారు.


సమగ్ర సర్వే విధానాన్ని వివరిస్తున్న డీసీ ఆంజనేయులు

◆ కాప్రా సర్కిల్‌లోని ఆరు డివిజన్లు కాప్రా, ఏఎస్‌రావునగర్, చర్లపల్లి, మీర్‌పేట్ హెచ్‌బీకాలనీ, నాచారం, మల్లాపూర్‌లో మొత్తం లక్ష 40 వేల కుటుంబాలు ఉన్నట్లు అధికారుల అంచనా. 6 డివిజన్లకు 869 మంది ఎన్యూమరేటర్లు, 87 మంది సూపర్‌వైజర్లను నియమించారు. ఒక్కో సూపర్‌వైజర్ టీమ్‌లో పదిమంది పాల్గొంటారు. ఒక్కొక్కరికి దాదాపు 150 నుంచి 170 కుటుంబాలను కేటాయించనున్నారు.

తప్పులు లేకుండా తగిన చర్యలు..

నేటి నుంచి మొదటి రెండ్రోజులు ఒక్కో ఎన్యుమరేటర్ పరిధిలో ఎన్ని కుటుంబాలున్నాయని గుర్తించి స్టిక్కరింగ్ వేయనున్నారు. అనంతరం ఈనెల 9 నుంచి సర్వే ప్రారంభించనున్నారు. సర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా నిర్వహిస్తామని డీసీ జగన్ స్పష్టం చేశారు.


జీహెచ్ఎంసీ కార్యాలయంలో సర్వే సామగ్రి

కాంగ్రెస్ బైక్ ర్యాలీ


బైక్ ర్యాలీలో కార్పొరేటర్ శ్రీదేవి

కుషాయిగూడ: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ వస్తున్న సందర్భంగా కార్పొరేటర్ బొంతు శ్రీదేవి ఆధ్వర్యంలో చర్లపల్లి డివిజన్ నేతలు బైక్‌ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా రాహుల్‌గాంధీకి స్వాగతం పలికారు. కాంగ్రెస్ డివిజన్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, నేతలు నాగిళ్ల బాల్‌రెడ్డి, గోపాల్‌యాదవ్ పాల్గొన్నారు.

మహిళకు అసభ్యకర మెసేజ్‌లు

మల్లాపూర్: మహిళకు అసభ్యకరమైన మెసేజ్‌లు పెడుతున్న వ్యక్తిని నాచారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లాపూర్ శ్రీరామ్ ఫైనాన్స్‌లో జాబ్‌కోసం వచ్చిన ఓ మహిళకు శ్రీరామ్ ఫైనాన్స్‌లో ఉద్యోగం చేస్తున్న ఎగ్జిక్యూటివ్ నగేష్ మెసేజ్‌లు పెడుతున్నాడు. దీంతో సదరు మహిళ బుధవారం నాచారం పోలీసుల ఫిర్యాదు చేసింది. వారు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

రాహుల్ గాంధీ సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు


మల్లాపూర్ డివిజన్ నేతలు

ఉప్పల్: ఉప్పల్ నియోజకవర్గం పరిధిలోని పలు డివిజన్ల నుంచి కాంగ్రెస్ నేతలు ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మందుముల పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీకి స్వాగతం పలికేందుకు భారీగా తరలివెళ్లారు. డివిజన్ అధ్యక్షులు, కాలనీ అసోసియేషన్ల ప్రతినిధులు, మహిళ నేతలు తదితరులు పెద్దఎత్తున తరలివెళ్లారు. నేటినుంచి కుటుంబ సమగ్ర సర్వే ప్రారంభం కానున్నందున రాహుల్‌గాంధీ పర్యటనకు ప్రాధాన్యత నెలకొంది. చెన్‌రెడ్డి రఘుపతిరెడ్డి, బాకారం అరుణ్, మహేష్ ఉన్నారు.

మల్లాపూర్: రాష్ట్రంలో జరిగే సమగ్ర కులగణనపై అభిప్రాయ సేకరణ బోయిన్‌పల్లి గాంధీ ఐడియాలజీ సెంటర్‌కు వచ్చిన రాహుల్ గాంధీ సమావేశాన్ని మల్లాపూర్ డివిజన్‌కు చెందిన ఎస్వీ కిట్టు ఆధ్వర్యంలో భారీసంఖ్యలో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు తరలివెళ్లారు. రాయప్ప, ఫిరోజ్‌ఖాన్, వెంకటేష్‌గౌడ్, నిరంజన్, రాంప్రసాద్, ప్రవీణ్, యాదిరెడ్డి, రత్నారెడ్డి, రోహిత్, రవియాదవ్, శ్రీను, రిత్విక్, వెంకటేష్, నరేష్ తదితరులున్నారు.


మందుముల పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు

ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలి

డీఈఓ విజయకుమారి

సాక్షి,సిటీబ్యూరో: జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంతో సహా ఘట్‌కేసర్ మండలంలోని ఎదులాబాద్ అర్బన్ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలలో రెండు సబార్డినెంట్, ఒక వాచ్‌మెన్ ఉద్యోగాలకు అర్హత, ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి ఓ ప్రకటనలో కోరారు. ఉద్యోగులను కాంట్రాక్టు పద్ధతిలో నియమిస్తామని, అభ్యర్థులు పదో తరగతిలో ఉత్తీర్ణులై ఉండాలని సూచించారు. ఈనెల 7వ తేదీ వరకు మేడ్చల్ కలెక్టరేట్‌లోని జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

సిబ్బంది పనితీరుతోనే ప్రత్యేక గుర్తింపు

జీడిమెట్ల: రాష్ట్రంలో ఉన్న అన్ని ఆర్టీసీ రీజియన్‌లలో సికింద్రాబాద్ రీజియన్ నెంబర్ వన్‌లో ఉండటానికి ఆయా డిపోల్లో పని చేసే సిబ్బందే కారణమని సికింద్రాబాద్ రీజియన్ మేనేజర్ ఖుష్రో షాఖాన్ అన్నారు. మంగళవారం సికింద్రాబాద్ రీజియన్ ప్రగతి చక్ర త్రైమాసిక పురస్కారాల కార్యక్రమాన్ని జీడిమెట్ల డిపో డీఎం ఆంజనేయులు ఆధ్వర్యంలో డిపోలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవితంలో క్రమశిక్షణ కలిగిన వ్యక్తి ప్రతి పనిలోనూ రాణిస్తారని అన్నారు. సంస్థలో ఉత్తమ పని తీరును కనబర్చిన డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లకు పండుగ వాతావరణంలో అవార్డులను అందజేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ డిప్యూటీ ఆర్ఎం మెయింటెనెన్స్ సురేష్ చౌహాన్, హకీంపేట్ డీఎం బహుబూతి, మేడ్చల్ డీఎం సుధాకర్, కంటోన్మెంట్ డీఎం సుధాకర్ రావు, ఉప్పల్ డీఎం శ్రీనివాస్, హెచ్‌సీయూ డీఎం మురళీధర్ రెడ్డి, కూకట్‌పల్లి డీఎం హరి, మియాపూర్ డీఎం వెంకటేష్, కుషాయిగూడ డీఎం మహేష్, రాణిగంజ్ డీఎం శ్రీధర్, చెంగిచర్ల డీఎం కవితతో పాటు వివిధ డిపోల సీఐలు, అసిస్టెంట్ మేనేజర్లు పాల్గొన్నారు.

ఆర్టీసీపై నమ్మకాన్ని కలిగించాలి

ప్రతి డ్రైవర్ రక్షణాత్మకమైన డ్రైవింగ్ చేసి ప్రజలకు ఆర్టీసీపై నమ్మకాన్ని కలిగించాలని కూకట్‌పల్లి డిప్యూటీ ఆర్ఎం మెయింటెనెన్స్ కవిత అన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి 154 కొత్త బస్సులు పెరగగా.. ప్రమాదాల శాతం సగానికి సగంగా తగ్గిపోయిందని తెలిపారు.


ప్రగతిచక్ర అవార్డులు అందుకున్న డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు

23 మందికి ఉత్తమ అవార్డులు..

సికింద్రాబాద్ రీజియన్‌లోని వివిధ డిపోల్లో పని చేస్తున్న 23 మంది డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లకు ఉత్తమ అవార్డులను అందజేశారు. అవార్డు తీసుకున్న వారిలో జీడిమెట్ల డిపోకు చెందిన ముగ్గురు డ్రైవర్లు, కండక్టర్, కుషాయిగూడకు డిపోకు చెందిన ఇద్దరు డ్రైవర్లు, హెచ్‌సీయూ డిపోకు చెందిన ఇద్దరు డ్రైవర్లు, ఇద్దరు కండక్టర్లు, కూకట్‌పల్లి డిపోకు చెందిన ఇద్దరు డ్రైవర్లు, ఇద్దరు కండక్టర్లు, హకీంపేట్ డిపోకు చెందిన ఇద్దరు డ్రైవర్లు, కంటోన్మెంట్ డిపోకు చెందిన ఇద్దరు కండక్టర్లు, ఉప్పల్ డిపోలో చేస్తున్న ఇద్దరు మెకానిక్‌లు, ఒక హెల్పర్‌కు అవార్డులు అందజేశారు.


హాజరైన వివిధ డిపోల సిబ్బంది

భక్తి శ్రద్ధలతో నాగుల చవితి పూజలు


మల్లన్న దేవాయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ మల్లిఖార్జున నగర్‌లోని మల్లన్న దేవాలయంలో మంగళవారం నాగుల చవితి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అల్వాల్ నాగదేవత ఆలయంలో మంగళవారం భక్తులు పుట్టలో పాలు పోసి ప్రత్యేక పూజలు చేశారు. రవి ప్రకాష్‌యాదవ్, కుటుంబసభ్యులు, భక్తులు పాల్గొన్నారు.


అల్వాల్ నాగదేవత ఆలయంలో..

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బోడుప్పల్: విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం 11 కేవీ సరస్వతీనగర్ ఫీడర్ పరిధిలోని పలు కాలనీల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ వేణుగోపాల్ ఓ ప్రకటనలో వెల్లడించారు. ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు శ్రీనగర్, సరస్వతీనగర్, శ్రీలక్ష్మినగర్, ఉదయ్‌నగర్, విజయపురికాలనీ, అశోక్‌నగర్, ప్రశాంత్‌నగర్ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మల్లాపూర్: 11 కేవీ మల్లాపూర్ విలేజ్ ఫీడర్ పరిధిలో బుధవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు మల్లాపూర్ విద్యుత్ ఏఈ నాగరాజు ప్రకటించారు. గ్రీన్‌హిల్స్ కాలనీ, అన్నపూర్ణ కాలనీ, నాగలక్ష్మినగర్, జేఎన్ఎన్‌యూఆర్ఎం, మీనానగర్, రెడ్డిసంఘం, నవోదయ మహిళా మండలి, ఎస్వీనగర్, తిరుమల మిలీనియం, వెంకటరమణ కాలనీ, బ్రహ్మపురి కాలనీలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

వాహనం బోల్తా పడి డ్రైవర్ మృతి

నాగోలు: ప్రమాదవశాత్తు వాహనం బోల్తా పడి డ్రైవర్ మృతి చెందిన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నాగోలు ఇన్‌స్పెక్టర్ సూర్యనాయక్ వివరాల ప్రకారం.. బిహార్ ప్రాంతానికి చెందిన అరుణ్‌రాయ్(31) హయత్‌నగర్ మండల పరిధి పసుమాములలోని ఆల్ రిచ్ డైరీ సంస్థలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో సంస్థ నుంచి టీఎస్ 11యూజీ 5476 అశోక్ లీల్యాండ్ వాహనంలో పాల ప్యాకెట్ల లోడ్ తీసుకొని వస్తుండగా వెంకట్‌రెడ్డి నగర్ కాలనీ రోడ్ నెంబర్–4 వద్ద దిగువ ప్రాంతంలో వాహనాన్ని నిలిపి వెనుక టైర్ కింద రాయి పెట్టేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఒక్కసారిగా వాహనం ముందుకు వెళ్లడంతో ఆపే ప్రయత్నంలో వాహనం వెనక పరిగెత్తుతుండగా పక్కనే ఉన్న షట్టర్‌కు ఢీకొని ఒక్కసారిగా అరుణ్‌రాయ్‌పై బోల్తా పడింది. స్థానికులు గమనించి అరుణ్‌రాయ్‌ని బయటకి తీసి గాంధీ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

బీసీ కమిషన్ పర్యటన వాయిదా

బీసీ అభివృద్ధి శాఖ జిల్లా అధికారి ఇందిర

సాక్షి,సిటీబ్యూరో: ఈనెల 7న రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించ తలపెట్టిన తెలంగాణ బీసీ కమిషన్ పర్యటన వాయిదా పడినట్లు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఆర్.ఇందిర ఒక ప్రకటనలో తెలిపారు. మేడ్చల్ జిల్లాలోని ప్రజాప్రతినిధులు, బీసీ సంఘాలు, సంచార జాతులు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సామాజికవర్గాల నాయకులు ఈ విషయాన్ని గమనించాలని ఆమె కోరారు. బీసీ కమిషన్ తదుపరి పర్యటన వివరాలను త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ పట్టణంలో అక్రమంగా రేషన్ బియ్యాన్ని విక్రయించడానికి ప్రయత్నిస్తున్న వ్యక్తులపై ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ పరుశురాం తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్‌ఓటీ పోలీసులు ఓ రేషన్ షాపులో కొనుగోలు చేసిన 12 క్వింటాళ్ల బియ్యాన్ని (24 బ్యాగులు) యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండలం జగ్గయ్య తండాకు చెందిన భూక్య రాజేందర్ విక్రయించడానికి మంగళవారం ఉదయం తరలించే క్రమంలో అతడిని పట్టుకున్నారు. అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా ఓ రేషన్ షాపు భర్త బాలాజీనగర్‌కు చెందిన అబ్దుల్ అజీజ్ (అన్నుబాయ్) బియ్యం విక్రయించారని తేలింది. దీంతో బియ్యం స్వాధీనం చేసుకొని నిందితులను ఘట్‌కేసర్ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



మేడ్చల్‌రూరల్: గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై మన్మధ్ తెలిపిన వివరాల ప్రకారం.. పోలీస్‌స్టేషన్ పరిధిలోని మునీరాబాద్ గ్రామ పరిధిలోని ఓఆర్‌ఆర్ సర్వీస్‌రోడ్డులో మంగళవారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలికి చేరుకుని పరిశీలించిన పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి వాహనం ఢీకొట్టడంతో మృతిచెందినట్లు గుర్తించారు. వెంటనే మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు.

యువతి అదృశ్యం


రోషిణి గైక్వాడ్(ఫైల్)

మేడ్చల్‌రూరల్: ఇంటి నుంచి వెళ్లిన యువతి అదృశ్యమైన సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన మాధవ్ గైక్వాడ్ కుటుంబంతో కలిసి మేడ్చల్‌కు వలస వచ్చారు. కిష్టాపూర్‌లోని సుమో బిస్కెట్ కంపెనీలో కార్మికుడిగా పనిచేస్తూ కంపెనీ క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నారు. మాధవ్ గైక్వాడ్ కుమార్తె రోషిణి గైక్వాడ్(18) వారం క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో మేడ్చల్ పోలీసులకు ఆశ్రయించారు. ఈ మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

చిలకలగూడ: ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, మృతుడి కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... కార్వాన్ ఆసిఫ్‌నగర్‌కు చెందిన సీహెచ్ శ్రీనివాససాగర్(45) అఖిల భార్యభర్తలు. వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. భవన నిర్మాణ కార్మికునిగా పని చేస్తున్న శ్రీనివాస్‌సాగర్ సమీప బంధువులకు డబ్బులు అప్పు ఇచ్చాడు. ఎన్నిమార్లు అడిగినా తిరిగి అప్పు తీర్చకపోవడం, ఆర్థిక ఇబ్బందులతో కొంతకాలంగా మనోవేదనకు గురవుతున్నాడు. ఈ క్రమంలో తీవ్ర అస్వస్థతకు గురైన శ్రీనివాస్ ఈ నెల 4వ తేదీన భార్య అఖిలతో కలిసి సికింద్రాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకోగా ప్రాథమిక నిర్ధారణలో కేన్సర్‌గా తేలింది. ఈ క్రమంలో సీతాఫల్‌మండి డివిజన్ ఉప్పరిబస్తీలో ఉంటున్న అత్త వారింటికి కుటుంబంతో కలిసి వచ్చాడు. సోమవారం సాయంత్రం భార్య ఆసిఫ్‌నగర్ వెళ్లింది. మంగళవారం వేకువజామున అఖిల సోదరి రెండో అంతస్థుకు వెళ్లి చూడగా బాల్కనీలో తాడుతో ఉరివేసుకుని వేలాడుతూ శ్రీనివాస్‌సాగర్ కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. భార్య అఖిల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.